# కుంతలమ్మ / చిత్తమ్మ / ఎంకటమ్మ / ఇంకా...

నిలువెత్తు నల్లజువ్వి చెట్టువు

కుంతలమ్మా... నువ్వు

నీ నడక

నా నడినెత్తిన దూలాడే నెలవంక

వాయిలాకు స్నానం నీ దేహం

నీ కండ్లల్లో ముంగిస కళ్ళ మార్మికత

ఎప్పుడూ

దిగులు చెరువు రాయికింద

జెర్రిలాగా

పడుకున్నప్పుడు

నన్ను నిద్రలేపింది నీ చూపే

చిత్తమ్మా ఆటపరిచింది నీ చప్పుడే

ఎంకటమ్మా...

భద్రలోకం నాపైన...

శాపగ్రస్త స్వర్గం నాకింద

నడుమ త్రిశంకు నరకం

నా తొట్టెల

గాలిలో ఊగీ... ఊగీ

వెలుతురు శాయంతా వొలికిపోతుంది

రాత్రి కొలువెక్కదు

కల కొడిగట్టదు

కుంతల చిత్తమ్మా

ఇప్పుడొక ఆప్స్ చాలు

నా తీట తీరడానికి

వొక ఔన్స్ గోమూత్రం చాలు

పోతున్న జారతనం మేల్కొంతందుకు

నాకు నిప్పు నువ్వే

నీరూ నువ్వే

మల్లపురం హేమలతా... బొనగిరి అంజమ్మ

మీ సావాసం...

నా ఏడూపాయల జాతర

మీకోసం రతిస్తాను

నిద్రనెరుగని రాత్రుల్ని

వనస్థలిపురాన్నంతా తగలబెట్టేస్తాను

నా పలారమంతా మీకోసమేనే

నా ఊరి పాశం తెగదు

మూలబడదు

తల్లులారా...

మీ చెంతలో చింతల మాను

కథలు చెబ్తానే ఉంటుంది

దఖ్ఖనీ ఆకాశమంతా

కుంకుమెక్కుతుంది

సర్వాయి పాపడూ

మైసూరు బసవడూ

రథమెక్కి ఊరేగుతారు

తీరం దాటని వానల్ని

కవిత్వంలోకి దారి మళ్ళిస్తారు

దూపతీర్చే దానిమ్మగింజలవుతారు

సిద్ధార్థ

(‘మల్లెల తీర్థం’ – 26.06.2014)